క్లుప్తంగా

నేడు వాహనాల బహిరంగ వేలం

నందిగామ టౌన్: ఆయా కేసులలో పట్టుబడిన వాహనాలకు శనివారం ఉదయం పదిగంటలకు బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ కోటేశ్వర్ తెలిపారు. స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో మైలవరం ఏఈఎస్ ఆధ్వర్యంలో ఒక ఆటో, మూడు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరములకు సెల్‌నంబరు 9440902458ను సంప్రదించాలని సీఐ కోరారు.

కంచికచర్ల ఎస్ఐగా బోనగిరి రాజు



కంచికచర్ల : కంచికచర్ల ఎస్ఐగా బోనగిరి రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ పెంకె వెంకట సత్యసుబ్రహ్మణ్యం కృష్ణాజిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా, ఆస్థానంలో బోనగిరి రాజు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. జూదం, అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటానని వివరించారు.

ఇసుక కూపన్ల పంపిణీ ప్రారంభం

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): ఇసుక కావాల్సిన వారికి స్థానిక షేర్‌మహ్మద్‌పేట గ్రామ సచివాలయంలో శుక్రవారం ఇసుక కూపన్ల పంపిణీని అధికారులు చేపట్టారు. మండలంలోని అనుమంచిపల్లి స్టాకు యార్డు వద్ద కూపన్ల పంపిణీతో పలు ఇబ్బందులు తలెత్తటంతో జిల్లా ఉన్నతాధికారులు గ్రామంలోని సచివాలయంలో ఇసుక కూపన్ల పంపిణీని ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం ఆరు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సచివాలయ సిబ్బంది ఇసుక కూపన్లు పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు. ఇసుక కావలసినవారు అందుకు తగిన నగదు చెల్లించి కూపన్లు పొందాలని వారు సూచించారు.

అన్నవరంలో ఫీవర్ సర్వే



అన్నవరం(జగ్గయ్యపేట): సీజన్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ బి. వెంకటరావు సూచించారు. మండలంలోని అన్నవరంలో శుక్రవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జ్వరంతో బాధపడే వారిని గుర్తించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ మూడు రోజులుగా గ్రామంలో సర్వే నిర్వహిస్తున్నామని సీజన్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంతేకాకుండా గ్రామంలో మురుగు ప్రాంతాలను గుర్తించామన్నారు. పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జ్వరంతో బాధపడేవారికి గ్రామంలోని ఆరోగ్యం కేంద్రంలో వైద్యచికిత్సలు కూడా నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రిక, త్రివేణి, జగజ్జీవన్‌రావు. రమేష్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



పెనుగంచిప్రోలు: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని హెచ్ఎం కె.జలజ పేర్కొన్నారు. స్థానిక కెవీఆర్‌జెడ్పీ హైస్కూల్‌లో మొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు చేసిన నమూనాలు, చిత్రాలు అందరినీ అకట్టుకున్నాయి. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు బాగా చదివి మంచి శాస్త్రవేత్తలు కావాలన్నారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ముక్కా సత్యనారాయణ మాట్లాడుతూ అంతరిక్ష దినోత్సవ ప్రాముఖ్యత, భారతదేశ అంతరిక్ష విజయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పటిష్ట భద్రత కల్పించాలి...



కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేయడం చాలా బాధాకరం. మహిళా వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వం పటిష్టమైన భద్రత కల్పించాలి. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది. పోయే ప్రాణాలను కాపాడే వైద్యులను కించపరచడం సరైన పద్ధతి కాదు. మహిళా వైద్య సిబ్బంది రక్షణకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తగుచర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ కె.మధురిమ, కంచికచర్ల పీహెచ్‌సీ



వైద్యులకు రక్షణ చర్యలు ఉండాలి...



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అతి దుర్మార్గంగా అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ఆసుపత్రుల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలి. మహిళా వైద్యులకు రెస్ట్‌రూమ్స్, వాచ్‌మెన్ సదుపాయాలు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా మహిళా డాక్టర్లకు ఓవర్ డ్యూటీలు లేకుండా చూడాలి.

– పి.ఇందిర, వైద్యాధికారి, పెనుగంచిప్రోలు పీహెచ్‌సీ

నిందితులను శిక్షించాలంటూ ర్యాలీ



వీరులపాడు పీహెచ్‌సీ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



మక్కపేటలో మానవహారం నిర్వహిస్తున్న సర్పంచి, విద్యార్థులు, టీచర్లు

మక్కపేట(వత్సవాయి) : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం మక్కపేటలో విద్యార్థులు, గ్రామస్తులు మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కోల్‌కతా సంఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినచర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల శివప్రసాద్, జెడ్పీ హెచ్ఎం చిత్రాల వెంకటేశ్వరరావు, సాయిసెంచరీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సవితాభరద్వాజ్, కేవైఎన్ శర్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ..

పెనుగంచిప్రోలు: కోల్‌కతాలో ఓవైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షంచాలని సర్పంచి వేల్పుల పద్మకుమారి, బీజేపీ జిల్లా మహిళా నాయకురాలు కల్లూరి శ్రీవాణి డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం గ్రామంలో పాఠశాల విద్యార్థులు, మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలు కాపాడుతున్న వైద్యులకు తప్పక రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.జలజ, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు కాకాని పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, విమల, జనసేన మండల అధ్యక్షులు తునికిపాటి శివ, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ పద్మకుమారి, శ్రీవాణి, విద్యార్థులు, టీచర్లు

ప్లకార్డులతో వైద్యబృందం నిరసన

వీరులపాడు: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యాధికారులు దీప్తి, నందిని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం వైద్యసిబ్బంది ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో పాటు భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా మహిళలపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తే తప్ప దాడులు నియంత్రించలేమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి ప్రణాళికలు

కలెక్టర్ సృజన

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన జరుగుతుందని కలెక్టర్ సృజన పేర్కొన్నారు. చిల్లకల్లు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రభుత్వం గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. గ్రామాబివృద్ధి ప్రణాళిక రూపకల్పన గ్రామసభ ద్వారా జరుగుతుందని తెలిపారు.

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గ్రామస్తులు చెబితే, గ్రామసభకు ఆయా పనులు ఆమోదం తెలుపుతుందన్నారు. అభివృద్ధి పనుల కోసం మండలానికి రూ.ఐదు కోట్లు కేటాయించినట్లు చెప్పారు. గ్రామంలోని వేదాద్రి రోడ్డులో పదేళ్లుగా లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, మురుగు నీరు పంట పొలాల్లోకి వస్తోందంటూ గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురావటంతో సమస్యను పరిష్కరించాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ఎన్నికలలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులకు పోటీ చేసేందుకు ఉండేంత పోటీ ఫీల్డ్‌అసిస్టెంట్ల ఉద్యోగాలకు ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు నిజాయితీగా పనిచేయాలని, తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సునీత, డీపీవో శివప్రసాద్ యాదవ్, నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు, ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దార్ నాగరాజు, ఏపీవో రామకృష్ణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



చిల్లకల్లులో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

మల్కాపురంలో రెండు గంటల ఆలస్యం..

మండలంలోని మల్కాపురం గ్రామంలో ఉపాధి హామీ గ్రామ సభ 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా అధికారులు 12గంటలకు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు అధికారులపై మండిపడ్డారు. గ్రామ సభ నిర్వహించే అధికారులు కూడా సమయానికి రాకపోవడంతో సర్పంచ్ శివాజీ ఎంపీడీవోకు ఫిర్యాదు చేయటంతో మధ్యాహ్నం నుంచి సభ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి గ్రామ సభలు నిర్వహించారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



ప్రత్యేక అలంకరణలో శ్రీతిరుపతమ్మవారు

పెనుగంచిప్రోలు:శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని పూలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు వారి గృహాల్లో లక్ష్మదేవిని విశేషంగా అలంకరించుకుని విశేష పూజలు నిర్వహించారు.

నందిగామ మండలంలో..

నందిగామ టౌన్: నందిగామ పట్టణం, మండలంలోని ఆయా ఆలయాల్లో శ్రావణ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ, వాసవీ కన్యక పరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన విశేష పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని సామూహిక కుంకుమార్చనలు చేశారు. పట్టణ సమీపంలోని పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి కనకదుర్గ అమ్మవార్లకు విశేష అలంకరణలు చేసి అభిషేకాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నిమ్మకాయల అలంకరణలో అంకమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

జడ్జి శోభారాణి

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి సూచించారు. స్థానిక జేఆర్‌సీ కళాశాలలో జగ్గయ్యపేట మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులకు ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.లీగల్ సర్వీసెస్ పనిచేసే విధానాన్ని వివరించారు. న్యాయ సహాయం కోసం లీగల్ సర్వీసెస్‌ను ఏవిధంగా సంప్రదించాలి అనేఅంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, ట్రెజరర్ సీహెచ్.ఆంజనేయులు, ఏజీపి టీఎల్.నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు ఈవీ.జగన్నాధరావు, సంతోష్, ప్యానల్ న్యాయవాదులు ఎం.విజయకుమారి, డి.నాగేశ్వరరావు, న్యాయవాదులు ప్రసాద్, మన్నె మురళి, రత్నబాబు, పారా లీగల్ వలంటీర్లు, కళాశాల యాజమాన్య ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ రాజీవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శోభారాణి, వేదికపై న్యాయవాదులు

ఇళ్ల తొలగింపు తగదంటూ వినతి

కంచికచర్ల : పేదల బతుకులు మార్చాల్సిన ప్రభుత్వం, అధికారుల రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై వందల కుటుంబాలను రోడ్డున పడేయాలని చూడటం దారుణమని ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్ అన్నారు. నాలుగు దశాబ్దాలుగా కంచికచర్ల చెవిటికల్లు సెంటర్ నుంచి అంబేద్కర్‌నగర్ వరకు రోడ్డు పక్కన ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారి ఇళ్లను తొలగించాలంటూ అధికారులు నోటీసులు జారీచేసిన నేపథ్యంలో అయా ఇళ్లను తొలగించవద్దంటూ బాధితులతో కలసి ఎంపీటీసీ సభ్యుడు ఉదయ్ శుక్రవారం గ్రామసభ వద్ద పంచాయతీ కార్యదర్శి బ్రహ్మంకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు గ్రామసభ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఇకనైనా ఇళ్ల తొలగింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బాధితులు నరేష్, కేవీ కృష్ణారావు, చిట్టిమ్మ, షేక్ కరీమా, పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శి బ్రహ్మంకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు, ఎంపీటీసీ ఉదయ్

కన్నుల పండువగా పుష్పయాగం

నందిగామ టౌన్:మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారికి మహాపుష్పయాగాన్ని వేద మంత్రోచ్ఛరణల నడుమ శుక్రవారం కన్నులపండువగా నిర్వహించారు. శ్రావణ మాస మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి లక్ష మల్లెలార్చన, లక్ష్మీగణపతి, మహాసరస్వతి, నవగ్రహ చండీ సహిత రుద్రహోమం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఆలయాన్ని పలురకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పుష్పాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన సామినేని మురళి, రాజ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో అమ్మవారికి పుష్పాభిషేకం నిర్వహించినట్లు ఈవో సీతారామయ్య తెలిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సత్యమ్మ అమ్మవారికి మహాపుష్ప యాగం నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మవారికి ప్రత్యేకపూజలు



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస మహోత్సవాలలో భాగంగా పట్టణంలోని అమ్మవారి ఆలయాలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్థానిక అద్దాల బజారులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకనకదుర్గ అమ్మవారికి రజత కవచాలంకరణ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని నాగసత్యమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. వెండిదేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, దేవాలయం ట్రస్ట్, నిర్వాహణ కమిటీ సభ్యులు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్‌మెంటు కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాలొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట):గ్రామంలో కొనసాగుతున్న ఈ-క్రాప్ నమోదును శుక్రవారం ఏవో వరలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ 2024కు సంబంధించి ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. అన్ని గ్రామాలలో వ్యవసాయాధికారులు ఈ క్రాప్ నమోదు చేస్తున్నారని, సెప్టెంబరు 15లోగా రైతులు తాము సాగుచేస్తున్న పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ-క్రాప్ నమోదు అయితేనే పంటనష్ట సమయంలో బీమా నగదు అందుతుందనే విషయాన్ని రైతులంతా గమనించాలన్నారు. కౌలు గుర్తింపుకార్డుల కోసం కౌలురైతులు ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు.

ప్రోటోకాల్ పాటించడం లేదంటూ ఆగ్రహం

నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలికవసతులు కల్పించడంతోపాటు గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఈవోపీఆర్డీ పద్మజ్యోతి పేర్కొన్నారు. మండలంలోని అంబారుపేట గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ ఐలపోగు రమ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి ఐలపోగు భాస్కరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు గ్రామసభలో గుర్తించే పనులకు రాజకీయ రంగు పులుముతున్నారని, కనీసం ప్రోటోకాల్ కూడా పాటించడం లేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు, అధికారుల తీరుకు నిరసనగా గ్రామసభను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి అక్కడ్నుంచి వెళ్లిపోయారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాట్లాడటంతో గ్రామసభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అన్నం పిచ్చయ్య, నాయకులు చందూరు వెంకట శ్రీనివాసరావు, ఐలపోగు ప్రశాంత్, ఐలపోగు రాంబాబు, మంచాల మాధవ్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంబారుపేటలో ప్రోటోకాల్ పాటించడం లేదంటూ అధికారులను ప్రశ్నిస్తున్న ఐలపోగు భాస్కరరావు

అక్రమ లేఅవుట్లపై చర్యలు కోరుతూ ఫిర్యాదు

జగ్గయ్యపేట అర్బన్: పురపాలక సంఘ పరిధిలో సుమారు 25 అక్రమ లేఅవుట్లు ఉన్నాయని, వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ 19వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నూకల సాంబశివ శుక్రవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ డివిజనల్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే అక్రమ లే అవుట్లకు సంబంధించి జగ్గయ్యపేట సబ్ రిజిస్ట్రార్‌కు ఆర్‌టీఐ ద్వారా ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

పెనుగంచిప్రోలు: గ్రామాల్లోని ప్రజల అభిప్రాయాలకనుగుణంగా ఉపాధి పనులను గుర్తించడం ద్వారా గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీఓ సాయిహర్ష తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన ఉపాధి హామీ పథకం కింద పనులను గుర్తించేందుకు శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి కృష్ణచైతన్యతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా సాయిహర్ష మాట్లాడుతూ మండలానికి రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని, వాటితో సీసీ రోడ్లు, డ్రైనేజీ, ప్రజలకు అవసరమైన ఇతర పనులు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఉపసర్పంచ్ బాడిశ పాపారావు, వార్డు సభ్యులు, కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.

ప్రజలు సూచించిన పనులే చేయాలి..

మండలంలోని వెంకటాపురం, సుబ్బాయిగూడెంలో జరిగిన గ్రామసభల్లో ఎంపీపీ మార్కపూడి గాంధీ , జెడ్పీటీసీ సభ్యురాలు పూట్ల నాగమణి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పనుల కేటాయింపులో ఎటువంటి వివక్ష ఉండకూడదన్నారు. ప్రజలు చెప్పిన పనులే చేయాలని, నాయకులు చెప్పిన పనులు చేయకూడదన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కృష్ణచైతన్య, సర్పంచ్ కూచి నర్సయ్య, పాపినేని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ వెల్ది ప్రభాకర్, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. అనిగండ్లపాడులో గ్రామసభలో తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, గ్రామస్తులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి : ఉపాధి హామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బి.రాజు సూచించారు. ఈ ఏడాది చేపట్టనున్న ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం మక్కపేటలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచులు భూక్యా సీతమ్మ, కొట్టె నగేష్, మల్లెల శివ పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నిర్వహించాల్సిన పనులను గుర్తించేందుకే ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తోందని ఏపీఎం యెహోషువా తెలిపారు. మండలంలోని చట్టన్నవరంతోపాటు ఆయాగ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్ దుర్గారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వెంకటాపురం సభలో మాట్లాడుతున్న పెనుగంచిప్రోలు ఎంపీపీ ఎం.గాంధీ

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : జాతీయ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఈవోపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు సూచించారు. కంచికచర్లతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామంలో చేపట్టనున్న పనులను గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవికుమార్, ఏపీఓ రమాదేవి, టెక్నికల్ అసిస్టెంట్ నక్కా నాగేశ్వరరావు, ఫీల్డ్‌అసిస్టెంట్ బొక్కా మోహన్, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, నాయకులు ఎం.రామకృష్ణ, వెటర్నరీ డాక్టర్ వినయ్‌కుమార్ హెచ్ఎం. రామకృష్ణ పాల్గొన్నారు.